క్లుప్తంగా

ఈఓపీఆర్డీగా సత్యనారాయణ



కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా బీవీ సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కరప మండల ఈఓపీఆర్డీగా పనిచేసిన ఎస్వీ శ్రీనివాసరావు ఏలూరు జిల్లా ముసనూరు మండలానికి బదిలీ అయ్యారు. అదే మండలంలో పనిచేస్తున్న సత్యనారాయణ ఇక్కడకు వచ్చారు. ముందుగా ఎంపీడీఓ కె.అప్పారావును కలసిన సత్యనారాయణ జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు.

డిప్యూటీ కమిషనర్‌గా శేఖర్



కమిషనర్ వెంకటరావును కలసిన డిప్యూటీ కమిషనర్ శేఖర్

కాకినాడ: స్థానిక నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా గుంటూరు శేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీడీఎంఏలో అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో పనిచేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో శేఖర్ నియమితులయ్యారు. గతంలో ఆయన 2020–21 మధ్య పెద్దాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. విధుల్లో చేరిన శేఖర్ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావులను మర్యాద పూర్వకంగా కలిశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మత్స్యశాఖ కార్యాలయంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి డీఎఫ్‌ఓ కరుణాకర్

కాకినాడ రూరల్: మత్స్యశాఖ క్షేత్ర స్థాయి ఉద్యోగులు ఏపీ ఫిషరీస్ ఏఐఎఫ్, ఎఫ్‌ఎం, ఎఫ్ఎస్ఎం పేరిట నూతన అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ మేరకు వారు క్యాలెండర్‌ను ఏటిమొగ వద్ద మత్స్యశాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఎఫ్‌ఓ కరుణాకర్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ ఫీల్డ్ అసిస్టెంట్ కొండలరావు మాట్లాడుతూ విజయవాడలో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్, ఫీల్డ్‌మెన్, షిషర్‌మెన్‌లతో నూతన కార్యవర్గం ఎన్నుకున్నామన్నారు. మత్స్యకారులు, ఆక్వా రైతులకు మెరుగ్గా సేవలందించాలని సిబ్బందిని మత్స్యశాఖ జిల్లా అధికారి కరుణాకర్ కోరారు. నూతన కార్యవర్గంలో స్థానం పొందిన వారిని అభినందించారు.


నేడు ఖోఖో క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పురుషులు, మహిళల విభాగాల్లో క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని అసోసియేషన్ కార్యదర్శి పట్టాభి సోమవారం తెలిపారు. కాకినాడ జేఎన్టీయూ క్రీడా ప్రాంగణంలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25, 26 తేదీల్లో సామర్లకోటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రేపు ఫలసాయానికి వేలం

కరప: పెద్దాపురప్పాడులోని జిల్లా పరిషత్‌కు చెందిన సర్వే నంబరు 316/1, 2లోని 0.75 సెంట్ల సాగు భూమి ఫలసాయం పొందేందుకు ఈ నెల 7న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి సీఈఓ అబ్బిరెడ్డి రమణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దాపురప్పాడు పంచాయతీ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ రెవెన్యూ అధికారి బహిరంగ వేలం నిర్వహిస్తారన్నారు.

ధర్నా స్థలి అభ్యంతరాలపై చర్చ



అఖిలపక్షం నాయకులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ ఇట్ల కిశోర్

కాకినాడ సిటీ: కాకినాడ ధర్నా స్థలి అభ్యంతరాలపై అఖిలపక్షం బృందంతో ఆర్డీఓ ఇట్ల కిశోర్ సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో చర్చించారు. అఖిలపక్షం నాయకుల అభిప్రాయాలను స్వీకరించారు. వారి సూచనలకు సానుకూలంగా స్పందించారు. మూడు రోజుల్లో డీఎస్పీ, కమిషనర్ తదితర అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, అఖిలపక్షం నాయకులను మరోసారి ఆహ్వానించి తుది నివేదికను కలెక్టర్‌కు నివేదిస్తామని ఆర్డీఓ తెలిపారు. జిల్లా ఎస్పీ నివేదికతో తుది నిర్ణయాలను జిల్లా యంత్రాంగం ప్రకటిస్తుందన్నారు.

నందనవనం.. సుమనోహరం

అభివృద్ధి అందివస్తే.. ప్రగతికి బాటలు పడితే.. ఆ నందనవనం సుమనోహరమే.. ఆహ్లాదకరమే. ఉరుకుల జీవితంలో ఉల్లాసాన్ని కలిగించేవే ఉద్యానాలు. బైక్ ఎక్కి, కారును తీసి ఎక్కడికైనా వాలిపోయే రోజులివి. కాలినడకకు కాస్తయినా తీరిక, వేదిక లేక ఎంతో మంది నగర వాసులు అనేక రుగ్మతలకు గురవుతున్నారు. అలాంటి వారికి ఇక్కడొక చక్కని నడక దారి రూపుదిద్దుకుంది.. పిల్లలకు ఆట వస్తువులు, హాయిని గొలిపే పచ్చ తివాచీలతో కాకినాడలోని గాంధీనగర్ పార్కు ఆహ్వానం పలుకుతోంది.. రా రామ్మని పిలుస్తోంది.

- ఆకర్షణీయంగా గాంధీనగర్ పార్కు
- చిన్నారులకు ఆట పరికరాలు
- ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు



పార్కులో సందర్శకులను ఆకట్టుకుంటున్న వాటర్ ఫౌంటేన్



చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట పరికరాలు

బోట్‌క్లబ్: కాకినాడ 41వ డివిజన్‌లోని గాంధీనగర్ పార్కు గతంలో నిరాదరణకు గురైంది. పిచ్చి మొక్కలతో నిండి అడుగు పెట్టేందుకు వీల్లేకుండా ఉండేది. నగరపాలక సంస్థ స్మార్ట్ సిటీ నిధులను కేటాయించడంతో పార్కు రూపురేఖలే మారిపోయాయి. చుట్టూ పరుచుకున్న పచ్చదనం, సందర్శకులు కూర్చునేందుకు వీలుగా బెంచీలు, చిన్నారులకు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. ఆహ్లాదంతోపాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం, ఓపెన్‌జిమ్ ఏర్పాటుతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పార్కులో అందమైన మొక్కలను ఏర్పాటు చేయడంతో కళకళలాడుతోంది. పార్కు సంరక్షణతోపాటు సుందరీకరణకు రూ.3.80 కోట్లను సమకూర్చడంతో అందంగా మారి ఆహ్లాదాన్ని పంచుతోంది. ఓపెన్ జిమ్, కూర్చునేందుకు బల్లలు, ప్రహరీ, వాకింగ్ ట్రాక్, పార్కు చుట్టూ డ్రైనేజీ, ప్రవేశ ద్వారం ఇలా అన్ని సదుపాయాలతో రూపుదిద్దుకుంది. పార్కులో ఏర్పాటైన వాటర్ ఫౌంటేన్ సందర్శకులను ఆకట్టుకుంటుంది. చిన్నారులకు ఆనందాన్ని పంచుతోంది.

పెరుగుతున్న సందర్శకులు

గతంలో ఈ పార్కు పిచ్చి మొక్కలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. పార్కులో అడుగు పెట్టాలంటే ప్రజలు భయపడేవారు. కేవలం వాకింగ్ చేసేందుకు మాత్రమే వినియోగించుకునేవారు. వాకింగ్ చేసి అలసిపోతే కొంతసేపు కూర్చునేందుకు అవకాశం ఉండేది కాదు. ప్రస్తుతం పార్కులో చక్కని వాతావరణం, వసతులు కల్పించడంతో సందర్శకులు సంఖ్య పెరుగుతోంది. ఓపెన్ జిమ్ ఏర్పాటుతో ఆరోగ్యాభిలాషులు రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు వస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఓపెన్ ఎయిర్ థియేటర్ సంగీత కళాకారులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. వాకర్స్ సహకారంతో ప్రతి ఆదివారం ఇక్కడ సంగీత విభావరి నిర్వహిస్తున్నారు. దీనిని సంగీత ప్రియులు ఆస్వాదిస్తున్నారు. క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా 5 షటిల్ కోర్టులు కూడా ఏర్పాటు చేశారు. వారు ఉదయం, సాయంత్రం ప్రాక్టీస్ చేసుకునేందుకు వీలు కలుగుతుంది.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సహకారంతో పార్కు అభివృద్ధి సాధ్యమైంది. ఈ పార్కులో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు సమావేశాలు నిర్వహించేందుకు ఒక భవనం నిర్మించి ఇవ్వాలని కోరగా, ఎమ్మెల్యే రూ. 20 లక్షల నిధులు మంజూరు చేయించారు. దీంతో విశ్రాంత ఉద్యోగులు తరచూ సమావేశాలు, వైద్య శిబిరాలు నిర్వహించుకోనేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

– గోడి సత్యవతి, డివిజన్ మాజీ కార్పొరేటర్

నడకకు ఎంతో అనువుగా..



గతంలో ఇక్కడ నడవాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు పార్కును బాగా అభివృద్ధి చేశారు. వాకింగ్ ట్రాక్‌ను సుందరంగా తీర్చిదిద్దడంతో నడిచేందుకు ఎంతో అనువుగా ఉంది. మాలాంటి వారికి ఈ పార్కు చాలా బాగా ఉపయోగపడుతుంది. చిన్నారులు, వృద్ధులకు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుంది.

–సీహెచ్ వెంకటరమణమూర్తి, సందర్శకుడు

ఈవీఎంల వినియోగంపై అవగాహన



పోలింగ్ బూత్ వద్ద ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బోట్‌క్లబ్: స్థానిక ఐదో డివిజన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద సోమవారం ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. స్థానిక భానుగుడి సెంటర్‌లోని పైండా అండాళ్లమ్మ జూనియర్ కళాశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఈవీఎంల పనితీరుపై ఏఆర్వో ప్రసాదరావు వివరించారు. ప్రధానంగా కొత్త ఓటర్లు ఏవిధంగా ఓటు వేయాలో తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద కాకుండా మురికివాడల్లో ఈ అవగాహన సదస్సులు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ 5వ డివిజన్ ఇన్‌చార్జ్ ఎన్వీ సాయిబాబా అధికారులను కోరారు. కార్యక్రమంలో కె.రామ్‌గోపాల్, సాది అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కార్యదర్శిగా సత్యనారాయణ

కాకినాడ రూరల్: వలసపాకల పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఇంద్రపాలెం సెక్రటరీ సత్యనారాయణకు బాధ్యతలు అప్పగించినట్టు ఎంపీడీఓ రమేష్‌నాయుడు తెలిపారు. వలసపాకల కార్యదర్శి బీబీ సెలవులో ఉండడంతో పంచాయతీలో కులగణన తదితర కార్యకలాపాలు కొనసాగించేందుకుగాను డీపీఓ అనుమతితో సత్యనారాయణకు బాధ్యతలు అప్పగించామన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



కరపలో జ్యోతీరావ్ ఫూలే విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- కరపలో రూ.2.80 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు

కరప: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. సోమవారం కరపలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరిగాయి. అనంతరం సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి జరిగిందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.115 కోట్లతో పనులు చేపట్టామని, అవి పూర్తి కావొచ్చాయన్నారు. 112 ప్రాంతాల్లో దేవాలయాలు, చర్చిలు, మసీదులు, పార్కుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో 32 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, మరో ఏడు వేల మందికి పట్టాలిచ్చేందుకు లేఅవుట్ సిద్ధమవుతోందన్నారు. ఎవరి సిఫారసు లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. సీఎం జగన్ పేదల పక్షాన నిలబడితే, చంద్రబాబు అనుచరగణం పథకాలకు అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. ముందుగా కురసాల సురేష్‌బాబు జ్ఞాపకార్థం ఆయన తండ్రి, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ రూ.1.10 లక్షలతో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతీరావ్ ఫూలే విగ్రహాన్ని ఎమ్మెల్యే కన్నబాబు ఆవిష్కరించి, ఘన నివాళులర్పించారు. అనంతరం సామూహిక మంచినీటి చెరువు చుట్టూ రూ.1.30 కోట్లతో నిర్మించిన వాకింగ్ ట్రాక్, కురసాల కన్నబాబు పార్కును ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.1.50 కోట్లతో నిర్మించిన మహాత్మా జ్యోతీరావ్ ఫూలే శెట్టిబలిజ కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు స్వాగతం పలకగా, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు వందన సమర్పణ చేశారు. వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, రవితేజ మండల శెట్టిబలిజ సామాజిక సేవా సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి చంద్రబోస్, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు తదితరులు ఎమ్మెల్యేను సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, ప్రముఖ సినీ దర్శకుడు కురసాల కల్యాణకృష్ణ, కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, వైస్ చైర్మన్ అనిచర్ల పార్వతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, జెడ్పీటీసీ నురికుర్తి రామకృష్ణ పాల్గొన్నారు.

దేశ సంస్కృతి గొప్పది



కరపలో ధర్మనిధి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు

కరప: మనదేశ సంస్కృతి గొప్పదని, అందుకే ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ పడాల రఘు అన్నారు. సోమవారం నడకుదురులో జరిగిన సమరసత సేవా ఫౌండేషన్ మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా సాంస్కృతిక ప్రముఖ్ చక్కా అజయ్‌వర్మ మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ధర్మాన్ని, దేశాన్ని కబ్జా చేస్తున్న విదేశీ సంస్కృతిని విడనాడాలన్నారు. యానాం ఖండ ఆర్ఎస్ఎస్ ప్రతినిధి రామారావు మాట్లాడుతూ అయోధ్య రామమందిరం కోసం 500 ఏళ్ల హిందువులు కన్న కలలను సాకారం చేసిన ఘనత భారత ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం 2024 డైరీలు, ధర్మనిధి కరపత్రాలను వారు ఆవిష్కరించారు. సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు వెలుబంట్ల శ్రీనివాస్, ముమ్మిడి శ్యామ్, సుందరరావు, ముమ్మిడి పెద్దకాపు, పేకేటి లక్ష్మీకాంతం, వి.సూర్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాలమ్మ ఆలయ వార్షికోత్సవం



కరపలో ఉప్పాలమ్మ తల్లి

కరప: స్థానిక ఉప్పాలయ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అర్చకుడు విలపర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితులు అమ్మవారికి అభిషేకం, మూలమంత్ర మూర్తికి విశేష పూజలు చేశారు. తర్వాత కుంకుమ పూజలు, హోమాలు జరిగాయి. తొలుత గ్రామంలోని 108 మంది ముత్తైదువులు, బాలికలు కలశాలతో దుర్గాదేవి గుడి నుంచి ఊరేగింపుగా ఉప్పాలమ్మ గుడికి చేరుకుని కలశపూజ, కుంకుమార్చనలు చేశారు. కరప, పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, ప్రముఖ సినీ దర్శకుడు కురసాల కల్యాణకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

'ఆడుదాం–ఆంధ్రా' రాష్ట్ర పోటీలకు ఎంపిక



ట్రోఫీ సాధించిన విద్యార్థినుల బృందాన్ని అభినందిస్తున్న పూర్ణచంద్రరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం– ఆంధ్రా' ఖోఖో బాలికల విభాగ రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రగతి విద్యా సంస్థల ఇంటర్ విద్యార్థినులు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో విద్యార్థినులు సంగన ఐశ్వర్య, అరనపల్లి మౌనిక, సీహెచ్ దీపిక, గొంప పావనిల బృందం ట్రోఫీతో పాటు నగదు బహుమతి గెలుపొంది, ఈ నెల 9 నుంచి 11 వరకూ విశాఖపట్నంలో జరిగే పోటీలకు అర్హత సాధించారు. ఈ మేరకు కళాశాలలో విద్యార్థినుల బృందాన్ని ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ ఎస్.పూర్ణచంద్రరావు సోమవారం అభినందించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గతంలో ఈ విద్యార్థినుల బృందం రాష్ట్ర స్థాయి జూనియర్ మీట్ అండర్–17 విభాగంలో మొదటి బహుమతి సాధించి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొందన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ అర్బన్ ఎంఆర్‌ఓ కార్యాలయ ఆవరణలోని పెన్షనర్స్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ బీహెచ్‌పీఎస్ వీర్రాజు విచ్చేసి క్యాన్సర్ వ్యాధి రకాలు, ఆధునిక చికిత్సా విధానాల గురించి వివరించారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన



రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఆరా తీస్తున్న ఏడీసీ నాగ నరసింహారావు

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు సోమవారం పరిశీలించారు. స్థానిక గాంధీనగర్, ఏటిమొగ నేతాజీ పార్క్ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతున్న విధానాన్ని పర్యవేక్షించారు. సాంకేతిక పరమైన ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? ఎంత సమయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తవుతుందనే అంశాలను సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగ నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు. కాకినాడలో సుమారు 29 వేల మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో ప్రభుత్వం తరఫున వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పనులు చేస్తున్నారని చెప్పారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

- కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు
- వివిధ సమస్యలపై 39 అర్జీలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, వివిధ విభాగాధిపతులతో కలసి ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 28, స్పందనకు 11 అర్జీలు వచ్చాయి. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను సాధ్యమైనంత వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలన్నారు. టిడ్కో గృహాల్లో నాలుగో అంతస్తులో కేటాయించిన ఫ్లాట్‌ను మొదటి అంతస్తులోకి మార్పు చేయాలని కోరుతూ ఓ దివ్యాంగుడు వినతి పత్రం అందజేశారు. పారిశుద్ధ్యం, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి వేర్వేరు అంశాలపై వినతులు అందాయి. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

మోడల్ పోలింగ్ స్టేషన్ల పరిశీలన

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా మోడల్ పోలింగ్ స్టేషన్ల ఎంపిక కోసం నియోజకవర్గ ఈఆర్వో, కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. ఏఈఆర్వోలతో కలసి ఆయా పోలింగ్ స్టేషన్లలో సదుపాయాలను పర్యవేక్షించారు. మహిళా ఓటర్లు అధికంగా ఉండే గరల్స్ పాలిటెక్నిక్ పోలింగ్ స్టేషన్, 18–19 మధ్య వయస్సు కలిగిన యువ ఓటర్లకు సంబంధించి ఎల్విన్‌పేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ పోలింగ్ స్టేషన్, దివ్యాంగులకు సంబంధించి ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలను ప్రతిపాదించారు. ఆయా చోట్ల సదుపాయాలు, కల్పించాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట తహసీల్దార్ దొర, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ డీవీ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు. సాయంత్రం నగరంలోని 233 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన బీఎల్‌వోలతో కమిషనర్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఫారం–6, 7, 8 ద్వారా వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఎటువంటి ఒత్తిళ్లకు తావులేకుండా దరఖాస్తుల పరిశీలన జరగాలన్నారు.

టెండర్లు రద్దు చేయాలంటూ ఫిర్యాదు

కాకినాడ సిటీ: పౌరసరఫరాల సంస్థ నుంచి రేషన్ షాపులకు బియ్యం, నిత్యావసర సరకులు సరఫరా చేసేందుకు బినామీ పేరుతో టెండర్లు దాఖలు చేసిన బొర్రా వెంకటరత్నంపై చర్యలు తీసుకోవాలని పెద్దాపురం మండలం దివిలికి చెందిన కె.శ్రీరామచంద్రమూర్తి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు సోమవారం ఫిర్యాదు చేశారు. జగ్గంపేట మండలం చంద్రమాంపల్లికి చెందిన బొర్రా వెంకటరత్నం తన భార్య పేరుతో రేషన్ షాపు నడిపేవాడని, అప్పట్లో రేషన్ షాపును అధికారులు తనిఖీ చేయగా 110 బస్తాలు తక్కువ ఉండడం గుర్తించి డీలర్‌షిప్‌ను రద్దు చేశారన్నారు. తిరిగి వెంకటరత్నం దివిలికి చెందిన అడ్డూరి సత్యనారాయణ పేరుతో స్టేజ్–2 కాంట్రాక్టర్‌గా ఉంటూ ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యం, నిత్యావసరాలు సరఫరా చేసేవాడన్నారు. దీనిద్వారా అతను అనేక అవకతవకలకు పాల్పడడంతో అధికారులు కేసులు నమోదు చేసి తొలగించారన్నారు. ఇప్పుడు మళ్లీ వెంకటరత్నం స్టేజ్–2 కాంట్రాక్టర్‌గా పుప్పాల కృపానందం పేరుతో దివిలి ఎంఎల్ఎస్ పాయింట్‌కు టెండర్ వేశాడన్నారు. అతని భార్యపై 6ఏ కేసులో ఉన్న వ్యాన్‌ను ట్రాన్స్‌పోర్టుకు వాడుతున్నాడని వివరించారు. అక్రమ మార్గంలో టెండరు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీరామచంద్రమూర్తి కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కాకినాడ రూరల్: వలసపాకల గ్రామంలోని సంతోష్‌నగర్‌కు చెందిన కొప్పిశెట్టి దుర్గా మల్లేశ్వరరావు (42) సోమవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. భార్యతో విడాకులు తీసుకుని తల్లిదండ్రులతో కలసి సంతోష్‌నగర్‌లో దుర్గా మల్లేశ్వరరావు ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, భార్యా పిల్లలకు దూరమై మానసిక ఒత్తిడికి గురవ్వడంతో ఇంట్లో పడక గదిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. తండ్రి రత్నం ఫిర్యాదు మేరకు ఎస్సై అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శుభకరా.. భీమేశ్వరా

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోటలో భీమేశ్వరస్వామివారు

సామర్లకోట: హరం హరా.. శుభకరా.. భీమేశ్వరా అంటూ ఆ స్వామిని భక్తులు కొలిచారు. సామర్లకోటలోని పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ నెలకొంది. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో తొలిపూజ చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. ఆలయంలోని ఉప ఆలయాలు, ధ్వజస్తంభం, పెద్ద నంది వద్ద పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని దేవస్థాన అన్నదాన ట్రస్టు నుంచి ఏర్పాటు చేశారు. శ్రీకాకుళపు వినయ్, సత్యనారాయణమూర్తి, సన్నిదిరాజు వెంకన్న, వేమూరి సోమేశ్వరశర్మ పూజాదికాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ప్రత్యేకంగా అలంకరించారు.

శివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

పంచారామ క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాల నిర్వహణలో భాగంగా సోమవారం ముహూర్తపు రాట వేశారు. ఈ మేరకు కాలభైరవస్వామి ఆలయం వద్ద ఈఓ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో గణపతి పూజలు చేశారు. మార్చి 6వ తేదీ నుంచి 11 తేదీ వరకూ ఆలయంలో స్వామివారి కల్యాణం, మహాశివరాత్రి, రథోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయంలో క్యూలైన్లు, విద్యుత్తు అలంకరణ, చలువ పందిర్లు, ఆలయ కోనేరులో నీరు నింపే కార్యక్రమాలను ప్రారంభించడానికి ముహూర్తపు రాట వేశారు. మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి, బీవీ రమణ, చల్లా సత్తిబాబు పాల్గొన్నారు.